సాక్షి పార్వతీపురం మన్యం


మంగళవారం ၊ 9 ၊ జనవరి ၊ 2024



జగనన్నకు చెబుదాంకు 227 అర్జీలు

- 8లో

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి 227 అర్జీలు అందాయి.



పోలమాంబ తరలివచ్చిన వేళ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి తరలివచ్చిన వేళ.. అమ్మవారి ఘటాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

- 8లో

సమ్మెను విరమించిన అంగన్‌వాడీలు

సాలూరు: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెను విరమించినట్టు సాలూరు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు బలగ రాధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొంత సమయం అడిగినందున సమ్మెకు విరామం ప్రకటించామన్నారు. మంగళవారం నుంచి అంగన్‌వాడీ సిబ్బంది యథావిధిగా విధులకు హాజరవుతారని స్పష్టంచేశారు.

న్యూస్‌రీల్

రిపబ్లిక్ డే పరేడ్‌కు రాజాం విద్యార్థి



ముచ్చుపల్లి ఉదయ్‌కిరణ్

రాజాం సిటీ: ఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పరేడ్‌కు జీసీఎస్ఆర్ ఎన్‌సీసీ విద్యార్థి ముచ్చుపల్లి ఉదయ్‌కిరణ్ ఎంపికైనట్టు కళాశాల ఎన్‌సీసీ కెప్టెన్ ఎస్.వెంకటరావు సోమవారం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి 14వ ఆంధ్రా బెటాలియన్ నుంచి ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఐలమ్మ తోటకు ఏనుగుల గుంపు



ఘనసర చెరుకుతోటల గుండా ప్రయాణిస్తున్న ఏనుగుల గుంపు

భామిని: గిరిజన ప్రాంతాల్లో పంట నష్టాలు కలిగించిన నాలుగు ఏనుగుల గుంపు తమ పాత నివాసమైన ఘనసరలోని తాలాడ ఐలమ్మ తోటకు సోమవారం చేరుకున్నాయి. మార్గమధ్యంలో ఇప్పమానుగూడ, తాటిమానుగూడలో ఆదివాసీలు పండించి రవాణాకు సిద్ధం చేసిన 38 బస్తాల ధాన్యంను చెల్లాచెదురు చేశాయి.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



విశాఖపట్నంలోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, కౌన్సిలర్

సాలూరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా, ప్రజాసేవలో తరిస్తున్న వలంటీర్లు ప్రతిసారి విధుల్లో నిబద్ధతను చాటుతున్నారు. సాలూరు పట్టణంలో 25వ వార్డులో నివసిస్తున్న పింఛన్ లబ్ధిదారు ముగడ సుశీల అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీ నల్ల నాని, వార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు సోమవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులు వారికి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు.

నీతి అయోగ్‌లో ఉద్యోగానికి ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ చేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: నీతిఅయోగ్ యాస్పిరేషనల్ బ్లాక్ ఫెలో ఉద్యోగానికి సీతంపేట ఐటీడీఏలో పీఓ కల్పనాకుమారి సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఒక పోస్టుకు 8 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు ఏడుగురు అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని పీఓ తెలిపారు.

నేటి సంక్రాంతి సెలవులు

పార్వతీపురంటౌన్: నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రకటిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 19న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.

సీఐలకు స్థానచలనం

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 29 మంది సీఐలను బదిలీచేస్తూ విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావును విశాఖ సిటీకి బదిలీ చేశారు. విశాఖ సిటీలో విధులు నిర్వహిస్తున్న కె.రామారావును విజయనగరం టూటౌన్ పీఎస్‌కు, టూటౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌వీ ఆనంద్‌ను కాశీబుగ్గ స్టేషన్‌కు బదిలీ చేశారు. విశాఖరేంజ్‌లో ఉన్న పైడి రంగనాథంను విజయనగరం ట్రాఫిక్‌కు, వీఆర్‌లో ఉన్న బి.వి.జగన్నాథరాజును విజయనగరం వీఆర్‌కు, విశాఖ సిటీలో పనిచేస్తున్న కె.అశోక్‌కుమార్‌ను విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్‌కు, ఎమ్.అప్పారావును మన్యంజిల్లా సీసీఎస్‌కు, బీఎమ్‌డీ ప్రసాద్‌ను పార్వతీపురం మన్యం జిల్లా సైబర్ సెల్‌కు బదిలీ చేశారు.

● 'సంత'షించేలా షాపింగ్



వారపు సంతకు భారీగా తరలివచ్చిన గిరిజనులు



దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు



ఫ్యాన్సీ వస్తువులు కొనుగోలు చేస్తున్న గిరిజన యువతులు

తెలుగువారి పెద్దపండగ సంక్రాంతి. పల్లెల్లో పండగ సందడి ఆరంభమైంది. కొత్తదుస్తులు కొనుగోలులో బిజీ అయ్యారు. ఇంటిల్లపాదికి కావాల్సిన దుస్తులను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. గిరిజనులకు వారపు సంతలే షాపింగ్‌మాల్స్. సీతంపేటలో సోమవారం జరిగిన వారపు సంతకు గిరిజనులు కొండలు దిగి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అటవీ ఉత్పత్తులను విక్రయించి పండగకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేశారు. దుస్తుల దుకాణాలు రద్దీగా మారాయి. నాటుకోళ్లు, మేకలకు గిరాకీ ఏర్పడింది. - సీతంపేట

సర్కారు బడిలో.. సాంకేతిక విప్లవం

- 3, 4, 5 తరగతి విద్యార్థులకు 'స్మార్ట్' బోధన
- ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఐఎఫ్‌పీఎస్ టీవీలతో విద్య
- 8వ తరగతి దాటిన విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు
- జిల్లాలో తొలివిడత 221 పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్‌టీవీలు
- రెండోవిడత 336 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్‌టీవీలు
- 8వ తరగతి విద్యార్థులకు తొలివిడతలో 8,183, రెండో విడతలో 9,874 ట్యాబ్‌లు

పార్వతీపురంటౌన్:

కాలం మారింది. విద్యారంగంలో సాంకేతిక విప్లవం కొత్తపుంతలు తొక్కుతోంది. సాంకేతికతను సర్కారు బడుల పిల్లలకు చేర్చడంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సఫలీకృతమైంది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. మొన్నటివరకు తరగతి గదిలో టీచర్లు కేవలం బ్లాక్, గ్రీన్ బోర్డులను ఉపయోగిస్తూ పాఠాలు చెప్పేవారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కార్పొరేట్ బడులకు దీటుగా, అంతకు మించి పూర్తి స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లల్లో బోధనా పద్ధతుల్లో సమూల మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే సరైన మౌలిక వసతులు ఉండవనే పరిస్థితి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ బడులంటేనే ప్రత్యేకంగా మాట్లాడుకునే రోజులు వచ్చాయి. మన బడి నాడు-నేడు కార్యక్రమంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి మౌలిక వసతులు కల్పించడం, డిజిటల్ విద్యాబోధనే దీనికి కారణం. ప్రపంచస్థాయిలో మన విద్యార్థులు పోటీ పడేందుకు అవసరమైన విద్యాబోధనకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలను సమకూర్చింది. నిరంతరాయంగా డిజిటల్ విద్యాబోధన అందించేందుకు, సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. దీనికోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తోంది.



జియ్యమ్మవలస ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా డిజిటల్ విద్యాబోధన (ఫైల్)

జిల్లాలో 557 స్కూళ్లకు 1801 స్మార్ట్ టీవీలు

జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు పనులు చేపట్టిన 557 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు తొలి, రెండవ విడతల్లో 1801 స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలను ప్రభుత్వం అందజేసింది. తొలివిడతలో 221 ప్రాథమిక పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలు వచ్చాయి. రెండవ విడతలో 336 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్ టీవీలను సమకూర్చింది. ఇవన్నీ ఆయా స్కూళ్లలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. వీటితో ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు.

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌లు పంపిణీ చేసింది. గతేడాది జిల్లాలోని 8,183 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. దీనికోసం రూ.35.23 కోట్లు ఖర్చు చేసింది. ఈ విద్యా సంవత్సరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు 9,898 ట్యాబ్‌లు సమకూర్చింది. ట్యాబ్‌కు మూడేళ్ల వారంటీ ఉంటుంది. విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగించే క్రమంలో అనుకోని పక్షంలో జరిగే స్క్రీన్ డ్యామేజీకి కూడా ప్రభుత్వమే రిపేరు చేయిస్తుంది.



సీతంపేట ఉన్నత పాఠశాలలో బైజూస్ తరగతులు వింటున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో అందించిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ ప్యానళ్ల వివరాలు

మండలం	సాంకేతిక పరికరాలు అందిన పాఠశాలల సంఖ్య	తొలివిడతలో ట్యాబ్‌ల పంపిణీ	రెండవ విడతలో ట్యాబ్‌ల పంపిణీ
బలిజిపేట	33	36	50
భామిని	33	46	55
గుమ్మలక్ష్మీపురం	48	96	41
గరుగుబిల్లి	31	31	72
జియ్యమ్మవలస	25	41	36
కొమరాడ	27	41	80
కురుపాం	30	78	25
మక్కువ	30	41	49
పాచిపెంట	42	82	46
పాలకొండ	27	39	77
పార్వతీపురం	55	99	86
సాలూరు	51	95	83
సీతంపేట	68	116	65
సీతానగరం	20	49	27
వీరఘట్టం	37	38	81

డిజిటల్ విద్యకు పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విద్యకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నాడు-నేడు పనులు చేపట్టిన స్కూళ్లకు ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు సరఫరా చేసింది. ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసింది. జిల్లాకు వచ్చిన ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు అన్ని స్కూళ్లలోనూ ఏర్పాటు చేశాం. వాటి ద్వారానే తరగతులు బోధిస్తున్నారు. డిజిటల్ విద్య వల్ల విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తారు.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జేఎన్‌టీయూ జీవీలో ఇన్నోవేషన్ సెంటర్



ఎంఓయూ కుదుర్చుకుంటున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రాంగణంలో ఏపీ ఎలక్ట్రానిక్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపీఈఐటీఏ) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ (ఐసీడీటీ) ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఏయూ ప్రాంగణంలోని రోష్యాస్ విర్‌చ్యువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో వర్సిటీ యాజమాన్యం మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ ఐసీడీటీ సెంటర్‌ను యూనివర్సిటీలో ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రోష్యాస్ విర్‌చ్యువల్ సొల్యూసన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్‌కేవీ సతీష్, సీఈఓ డాక్టర్ ఒ.రామ్‌మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబు, కేసీబీ రావు, డి.రాజ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గజపతినగరం: ప్రభుత్వం ఎల్లప్పుడూ అంగన్‌వాడీలకు అండగా ఉంటోందని, అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల జీతాలు పెంచిందని, చాలా డిమాండ్లు పరిష్కరించిందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి మీదుగా విజయనగరం వెళ్తున్న మంత్రిని గజపతినగరం బ్రిడ్జి సమీపంలో అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం కలిశారు. తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అన్నివర్గాలకు మేలుచేస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీలకూ మంచి చేస్తుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక శక్తుల వలలో చిక్కుకుని ధర్నాలు, సమ్మె చేయడం తగదన్నారు. తక్షణమే విధుల్లో చేరాలని కోరారు. వేతనాలు ఎవరు పెంచారో గుర్తించాలన్నారు. వేతనాలు ఎప్పటికప్పుడు పెంచేందుకు వీలుకాదని, ఐదేళ్ల కోసారి పెంచేందుకు సాధ్యపడుతుందన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమం



చల్లపేట ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి
- సచివాలయం, ఆస్పత్రి నూతన భవనాలను ప్రారంభించిన మంత్రులు బొత్స, రాజన్న

మెంటాడ:

ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాటను శతశాతం నిలబెట్టుకున్నామని, ప్రతి ఇంటిలో సంక్షేమం వెల్లివిరిసేలా దేశంలోనే పెద్దమొత్తంలో రూ.3వేలు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెంటాడ మండల కేంద్రంలోని సచివాలయం, చల్లపేట గ్రామంలోని ఆస్పత్రి నూతన భవనాలను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొరతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తున్నామన్నా రు. 45 ఏళ్ల వయస్సుదాటిని మహిళల ఆర్థికాభివృద్ధికి 'వైఎస్సార్ చేయూత'ను అందిస్తుంటే కొంద రు వక్రబుద్ధితో తప్పుబడుతున్నారన్నారు. కనీసం ఒక్కపథకం కూడా అందనివారు ఈ సభలో ఉన్నారా.. ఉంటే చేయి ఎత్తాలన్నారు. ఒక్కరూ చేయి ఎత్త కపోవడంతో... ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇదే నిదర్శనమన్నారు. అందుకే ధైర్యంగా వచ్చి ప్రజల ను ఓట్లు అడుతున్నామన్నారు. ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నట్టు వెల్లడించారు. ఐదేళ్లగా నీతి, నిజాయితీతో పాలన సాగిస్తున్న గొప్ప ప్రభుత్వం మనదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య పోటీ జరుగుతుందని, నిరంతరం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలబడాలని కోరారు.

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ మెంటాడ మండలంలో ఇప్పటివరకూ 6,509 పింఛన్లు ఉండగా ఈ రోజు నుంచి ఆ సంఖ్య 7,797కు పెరిగాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో 65ఏళ్లు దాటితేగాని పింఛన్‌కు అర్హులు అయ్యేవారు కాదని, అదే ఇప్పుడు మన ప్రభుత్వంలో 60 ఏళ్లకు తగ్గించి పెన్షన్ మంజూరుచేస్తున్నామని గుర్తుచేశారు. గతంలో దివ్యాంగత్వం 80 శాతం ఉంటే పింఛన్ ఇచ్చేవారిని, ఇప్పుడు 40 శాతం ఉన్నా పింఛన్ అందజేస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తరువాత అంతలోతుగా ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు ఇస్తున్నది మన రాష్ట్రంలోనేనని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జేసీ మయూర్ అశోక్, బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు లెంక సన్యాసప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, మెంటాడ, జక్కువ గ్రామాల పీఏసీఎస్ అధ్యక్షులు తిడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పారావు, గృహసారథుల కన్వీనర్ కనిమెరక త్రినాథ్, సర్పంచ్‌లు రేగిడి రాంబాబు, తాడ్డి తనూజ, ఎంపీటీసీలు పి.కుమారి, చప్ప సూర్యకుమారి, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ రామకృష్ణ, పార్టీ నాయకులు ఎస్.నారాయణరావు, పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు పింఛన్ భరోసా



పింఛన్ నగదు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇచ్చిన మాట ప్రకారం రూ.2వేల పింఛన్‌ను రూ.3వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిదేనని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెనుబర్తిలో అవ్వాతాతలకు సోమవారం పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు , బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీలు అంబల్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, పార్టీ మండలాధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ తుమ్మగుంటి మాధవి, నాయకులు పరమేష్, అచ్చుతరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్యాబోధనే ప్రధానం

రామభద్రపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు అన్నారు. రామభద్రపురం ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. వెనుకబడిన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడేలా విద్యాప్రణాళికలు అమలుచేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేదకుటుంబాల విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామభద్రపురం ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

క్లుప్తంగా

చిట్టంపాడు పక్కా రోడ్డుకు రూ.10.4 కోట్లు

- పీఎం జన్‌మాన్‌లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- పంచాయతీ రాజ్ ఎస్ఈ రమేష్ గుప్తా


జీఎస్ఆర్ గుప్తా, పంచాయతీరాజ్ ఎస్ఈ

విజయనగరం రూరల్: శృంగవరపుకోట మండలంలోని గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు ప్రధానమంత్రి జన్‌మాన్ పథకం ద్వారా పక్కా రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రతిపాదనలు రూపొందించామని ఆశాఖ ఎస్ఈ జీఎస్ఆర్ గుప్తా సోమవారం తెలిపారు. విశాఖ–అనంతగిరి–అరకు రోడ్డు నుంచి శెనగపాడు, చిట్టంపాడు మీదుగా ప్రధాన గ్రామమైన గూనపాడు వరకు 10.2 కిలోమీటర్ల రోడ్డును 10.4 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఆమోదానికి సమర్పించనున్నట్లు చెప్పారు. ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఉద్దేశించిన పీఎం జన్‌మాన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


పాలక రామారావు (ఫైల్)

భామిని: మండలంలోని పెద్ద దిమిలికి చెందిన పాలక రామారావు (47) ఇటీవల ఘనసర–సతివాడ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. రామారావు పాస్టర్ కావడంతో పెద్ద ఎత్తున స్థానికులు, సర్పంచ్ గురాన శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన గృహానికి చేరుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య రూప, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె సృజన వలంటీర్‌గా పనిచేస్తోంది.

సంక్రాంతి పండగకు 54 ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈస్ట్‌కోస్ట్ రైల్వే 54 ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ఈ రైళ్లు యథావిధిగా నిర్ణీత సమయాల్లో తిరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా మీదుగా వెళ్లే ఈ ప్రత్యేక రైళ్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కొన్ని ప్రధాన రైళ్ల వివరాలిలా..
రైలు నంబర్ 08537 శ్రీకాకుళం–కొల్లాం,
07089 సికింద్రాబాద్ బరంపురం,
07090 బరంపురం–వికారాబాద్,
08538 కొల్లాం – శ్రీకాకుళం రోడ్డు,
07094 బరంపురం– సికింద్రాబాద్,
07091 వికారాబాద్ –బరంపురం,
08547 శ్రీకాకుళం రోడ్డు, వికారాబాద్,
07025 సికింద్రాబాద్–బరంపురం,
08537 శ్రీకాకుళం రోడ్డు– కొల్లాం,
07026 బరంపురం –సికింద్రాబాద్,
02809 భువనేశ్వర్ –సికింద్రాబాద్,
07027/07028 హైదరాబాద్–బరంపురం–హైదరాబాద్
02810 తిరుపతి–భువనేశ్వర్,
08538 కొల్లాం –శ్రీకాకుళం రోడ్డు,
07093:/07094 సికింద్రాబాద్–బరంపురం, –సికింద్రాబాద్, 09069/09070 సూరత్ – బరంపురం–సూరత్,
08537 శ్రీకాకుళం రోడ్డు–కొల్లాం,
02809/02810 భువనేశ్వర్–తిరుపతి –భువనేశ్వర్,
09069/09070 సూరత్– బరంపురం– సూరత్‌లతో పాటు మరికొన్ని రైళ్లను ప్రవేశపెట్టారు. రైళ్ల సమయం, బెర్తుల ఖాళీలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత


గుంటూరు జిల్లాలో పప్పల ఆదినారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తిరుపతమ్మ దంపతులు

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామానికి చెందిన పప్పల ఆదినారాయణ రెండు కిడ్నీలు పాడవడంతో గుంటూరు జిల్లాలో ఉన్న ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నాడు. గ్రామానికి చెందిన వలంటీర్ పప్పల తిరుపతమ్మ భర్త గురునాయుడుతో గుంటూరు వెళ్లి పింఛన్ లబ్ధిదారు ఆదినారాయణకు రూ.10వేలు వైఎస్సార్ పింఛన్ కానుకను సోమవారం అందజేసింది. దీంతో లబ్ధిదారు, బంధువులు సంతృప్తి వ్యక్తం చేశారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹85	₹140	₹150

జగనన్నకు చెబుదాంకు 227 అర్జీలు


విజయనగరం అర్బన్:అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్ఓ అనిత, డిప్యూటీ కలెక్టర్లు


పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


విజయనగరం అర్బన్:ఓటు హక్కుపై అవగాహన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఆర్ఓ అనిత

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి 227 అర్జీలు అందాయి. ఈ వినతులను డీఆర్ఓ అనిత, ఆర్‌డీఓ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, దొర, సుమబాల తదితరులు స్వీకరించారు.

ఓటు హక్కుపై అవగాహన పుస్తకం ఆవిష్కరణ
స్పందన కార్యక్రమం అనంతరం సోషల్ వర్కర్ కె.సన్యాసిరాజు రచించిన ఓటు హక్కుపై అవగాహన పుస్తకాన్ని డీఆర్ఓ అనిత ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులే పాలకులని, పౌరుడు, ప్రజాస్వామ్యం పరస్పర సంబంధానికి మూలం ఓటు హక్కు అని ఈ సందర్భంగా డీఆర్ఓ తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం
విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి, చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ మండ జావలీ అల్ఫాన్స్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం
పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పై వచ్చిన ఫిర్యాదులపై స్పందించి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు సైబ ర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బీసీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ వాసు నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సరైన పరిష్కారం చూపాలి
పార్వతీపురం: స్పందనలో ప్రజలు పెట్టుకునే అర్జీలకు వారు సంతృప్తి చెందే విధంగా సరైన పరిష్కారం చూపాలని పార్వతీపురం మనన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీ ఎస్‌డీసీ జి.కేశవనాయుడులతో కలిసి ప్రజలనుంచి 211 అర్జీలు స్వీకరించారు.

ట్రైసైకిల్స్ అందజేత
స్పందన కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన జి.పైడయ్య, బలిజిపేట మండలం గౌరీపురం గ్రామానికి చెందిన ఎస్.వాసుదేవరావు, జియ్యమ్మవలస మండలం జియ్యమ్మవలస గ్రామానికి చెందిన రాయల.సత్యన్నారాయణకు ట్రై సైకిల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌లు పాల్గొన్నారు.

జాతీయ త్రైక్వాండో పోటీల విజేతకు కోలగట్ల అభినందన


విజేతను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో కాంస్య పథకాన్ని సాధించిన హిమశ్రీని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం కోలగట్ల గృహానికి చేరుకున్న కాంస్య పతక విజేత హిమశ్రీ పోటీ వివరాలు, గెలుపొందిన తీరును ఆయనకు వివరించింది. మధ్యప్రదేశ్ లోని బేతల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5 వరకు జరిగిన త్రైక్వాండో పోటీలలో హిమశ్రీ కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఇటీవల నగరానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో వివిధ పతకాలను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కోచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్ షిప్..
జిల్లా క్రీడాకారుల సొంతం


విజేతలను అభినందిస్తున్న డీఈఓ బి.లింగేశ్వరరావు

విజయనగరం అర్బన్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 16వ నేషనల్ లెవెల్ ఆల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఓపెన్ చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. ఈ మేరకు భజరంగ్ మార్షల్ ఆర్ట్స్ కోచ్ బుదురై సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలు సోమవారం డీఈఓ బి.లింగేశ్వరరెడ్డిని కలిసి అభినందనలు అందుకున్నారు. స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అండర్–17 విభాగంలో పొండ్రంకి పావని, నోడగాళ్ల వినయ్‌కుమార్‌లకు గోల్డ్ మెడల్స్, అండర్–14 విభాగంలో మైలపిల్లి మణకంఠ నిఖిల్, పొండ్రంకి సంపత్ స్వామిలకు గోల్డ్ మెడల్స్, మేడిశెట్టి గౌతంవర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. డీఈఓను కలిసిన వారిలో కరాటే అకాడమీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పెంకి అశ్విని, వలస సాయి ప్రసాద్, హ్యూమన్ రైట్స్ ఏపీ ప్రధాన కార్యదర్శి పొండ్రంకి సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ఎంపీటీసీ


మంత్రులు బొత్స, రాజన్నదొరతో ఎంపీటీసీ నరసీయ్యమ్మ


పార్టీలో చేరుతున్నవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

మెంటాడ: మండలంలోని ఆంద్ర గ్రామ సెగ్మెంట్‌కు చెందిన మండల ప్రాదేశిక సభ్యురాలు(ఎంపీటీసీ) పొంచలజన్ని నరసీయమ్మ తన తండ్రి పొంచల జన్ని కృష్ణతో కలిసి సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రులు పీడికరాజన్నదొర, విద్యాశాఖమంత్రి బొత్ససత్యనారాయణ సమక్షంలో మెంటాడలో ఆమె పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెకు డిప్యూటీ సీఎం రాజన్నదొర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆంద్ర మాజీ సర్పంచ్ కుంచె తిరుపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాకపల్లి నాగరాజు, లోతుగెడ్డ వైస్ సర్పంచ్ సూర్రెడ్డి పైడపునాయుడు ఉన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో చేరిన జనసేన నేతలు
రాజాం: పట్టణంలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీ నేతలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాజాం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఈ చేరికలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న సామాజిక న్యాయం, సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు గ్రామానికి చెందిన పి.శంకరరావు, ఒ.వెంకటేష్, వి.వాసు, పి.దుర్గాప్రసాద్, పి. వెంకటేష్, ఎన్.చందు, డి.తిరుపతి, దొర, పి.శ్రీను, పి.లక్ష్మం తదితరులు వెల్లడించారు. మొత్తం 20 కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, శాసపు వేణుగోపాలనాయుడు, వంజరాపు విజయ్‌కుమార్, తోట తిరుమలరావు, పిట్టా జగదీష్, కోరాడ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతంలో 'జాతీయ యువజనోత్సవాలు'

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ యువజన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి 2 (ఏ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఉపేంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల నుంచి గాజులరేగ వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీగా వెళ్లి స్వామి వివేకానందుని నీతి వ్యాఖ్యలను ప్లకార్డుల ద్వారా అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

కానరాని అడవి ఏనుగు

- రెండు నెలలుగా అదృశ్యం..
- ఏమైందని ప్రశ్నిస్తున్న జంతు ప్రేమికులు


అడవి ఏనుగు హరి (ఫైల్)

కురుపాం: ఒడిశా ప్రాంతం నుంచి ఆరేళ్ల కిందట గుంపుగా కురుపాం నియోజకవర్గంలోని అడుగు పెట్టిన అడవి ఏనుగుల్లో ఒకటైన హరి (మగ ఏనుగు) జాడ కానరావడం లేదు. చిన్న వయస్సులో గుంపుతోపాటు కురుపాం నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన మగఏనుగుతో అటవీశాఖ అధికారులు మమేకమై దానికి హరి అని పేరు పెట్టారు. గుంపులో హరి తెలివైనదిగా చెప్పుకుంటుంటారు. హరి అని పిలిచిన వెంటనే దగ్గరకు రావడం, దాహం వేస్తే స్వయంగా తాగునీటి బోరువద్దకు వెళ్లి కొట్టుకుని తాగడం వంటి పనులు చేస్తూ నియోజకవర్గ ప్రజలతో మమేకమైంది. అయితే రెండు నెలలుగా హరి జాడ కానరావడం లేదు. దీంతో అసలు హరి ఉన్నట్లా? లేక మృత్యువాత పడిందా? అన్నది తెలియడం లేదని జంతుప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలలుగా జాడ లేని హరిని అటవీశాఖ అధికారులే గుర్తించాల్సి ఉందని అభిప్రాయ పడుతున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం


భోగాపురం: మిరప వెంకటేష్(ఫైల్)

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు సోమవారం దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన మిరప వెంకటేష్(20) ఈ మధ్య భవానీ మాల వేసుకుని దీక్ష పూర్తి చేసుకుని విజయవాడ వెళ్లి దుర్గాదేవికి మొక్కులు చెల్లించుకుని తిరిగి గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో అమ్మవారి ప్రసాదాలను బంధువులకు ఇచ్చేందుకు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి వెళ్లాడు. బంధువులకు ప్రసాదాలను ఇచ్చి తిరిగి వస్తుండగా భోగాపురం పెద్ద కానాల వద్దకు చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన తుప్పల్లోకి దూసుకుపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి ఆదిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..
విజయనగరం క్రైమ్: విజయనగరం, కోరుకొండ రైల్వేస్టేషన్‌ల మధ్య జొన్నవలస గేట్ సమీపంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల వ్యక్తిని రైలు ఢీకొందని జీఆర్‌పీ ఎస్సై రవివర్మ సోమవారం తెలిపారు. మృతదేహం నుజ్జునుజ్జయి, గుర్తుపట్టలేనంతగా ఉందన్నారు. మృతుడి వంటిపై గోధుమరంగు పంచె, నీలం, ఎరుపు, నలుపు రంగులతో కూడిన నిలువు గీతలు కలిగిన షర్ట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని మరో వృద్ధుడు..
బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లికి చెందిన వృద్ధుడు చింతల త్రిమూర్తులు(73)సీతానగరం, బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై పట్టాలు దాటే సమయంలో గూడ్స్ రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే ఔట్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్.కృష్ణారావు విలేకరులకు తెలిపారు. మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు చెప్పారు.

పోలమాంబ తరలివచ్చిన వేళ

- పులకించిన భక్తజనం
- శంబరలో జాతర శోభ


అమ్మవారి ఘటాన్ని పట్టుకుని తీసుకువస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర


ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పోలమాంబ అమ్మవారు శంబర గ్రామానికి తరలివచ్చిన వేళ..అమ్మవారి ఘటాలను చూసిన భక్తులు పులకించిపోయారు. ఘటాలకు ఎదురెళ్లి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలు, తప్పెటగుళ్లు, మహిళల కోలాటాలతో అమ్మ వారిని సోమవారం రాత్రి గ్రామంలోకి ఆహ్వానించారు. ఏటా జనవరి నెలలో జరగనున్న జాతరకు అమ్మవారు గ్రామానికి చేరుకోవడంతో జాతరశోభ సంతరించుకుంది. గోముఖినది ఆవలి ఒడ్డున ఉన్న అమ్మవారి గద్దెవద్ద పూజారి, కుప్పిల, గిరడ, మున్సిబ్ కుటుంబాల వారు, గ్రామ పెద్దలు ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను గ్రామంలోకి తీసుకువచ్చారు. అమ్మవారికి మంగళవారం కాళ్లనొప్పుల కారణంగా గ్రామంలోని చదురుగుడిలో విశ్రాంతి తీసుకుని, బుధవారం నుంచి 14రోజుల పాటు ఆలయంలో కొలువై పూజలందుకుంటారు. ప్రతి రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఘటాలకు గ్రామంలోని అన్ని వీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ఈనెల 22న తొలేళ్ల ఉత్సవం, 23న సిరిమానోత్సవం, 24న అనుపోత్సవం నిర్వహించి ఈనెల 30న మారు జాతర నిర్వహిస్తారు. ఇలా 10 వారాల పాటు అమ్మవారి జాతర సాగుతుంది. కార్యక్రమంలో ఈవో వి.వి.సూర్యనారాయణ, మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్‌లు పూడిదాలినాయుడు, గంజికాశీ నాయుడు, వసంతుల భాస్కరరావు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, దేవాదాయ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘటాలను దర్శించుకున్న డిప్యూటీ సీఎం
శంబర పోలమాంబ అమ్మవారి ఘటాలను సోమవారం రాత్రి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర దర్శించుకున్నారు. గ్రామంలోకి అమ్మవారి ఘటాలు వస్తుండగా ఎదురుగా వెళ్లి అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

సారా బట్టీలపై పోలీసుల దాడి

- వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


కొత్తవలస: ముసిరాం గ్రామం సమీపంలో సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్ తదితరులు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌తో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామం సమీపంలో గల రహస్యప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీలపై సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేసి సారా తయారీకి డ్రమ్ములతో నిల్వ చేసిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించిన సారా తయారీదారులు అక్కడినుంచి పరారయ్యారు. సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తులను త్వరలోనే గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వీరజనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు లీటర్ల సారాతో పట్టుబడిన మహిళ
లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో కొత్తవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రాజేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా గ్రామానికి చెందిన నెల్లి అప్పలనర్సమ్మ సారా అమ్ముతూ పట్టుబడింది. ఈ మేరకు ఆమె నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేశ్వరం తెలిపారు.

20 మద్యం సీసాల సీజ్
గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కర్రోతు సన్యాసిరావు నుంచి 20మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ డీఎస్పీ ఎస్.మహీంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన ఎ.నాగరాజును గజపతినగరం మరుపల్లి గ్రామం వద్ద12 మద్యం సీసాలతోను, గజపతినగరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గేదెల సత్యనారాయణ నుంచి 44మద్యం సీసాలను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

100 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్ట్
నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు గ్రామంలోని బెల్టు షాపులో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 100 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.